మండుటెండలో.. మండే గుండెలు

బ్యాంకుల వద్ద పింఛన్‌దారులు పడిగాపులు

- మొదలైన పింఛన్ దారుల కష్టాలు
- బ్యాంకులు, ఆన్ లైన్ కేంద్రాలవద్ద పడిగాపులు
- ఎండవేడిమికి తాళలేక పండుటాకుల కష్టాలు
- చంద్రబాబుకు శాపనార్థాలు

కడుపులో చల్ల కదలకుండా కూర్చునే చోటికే వచ్చే పింఛన్ ...మాయదారి పన్నాగాలతో మరోమార్గంలోకి వెళ్లిపోయింది. ఎన్నికల సంఘానికి చంద్రబాబు, అతని అనుచరులు ఫిర్యాదు చేయడంతో వలంటీర్ల సేవలు దూరమయ్యాయి. ఐదేళ్ల కిందటి కష్టాలు పునరావృతమయ్యాయి. మళ్లీ పింఛన్ కోసం అవ్వాతాతలు ఆ గడపా..ఈ గడపా తొక్కాల్సి వస్తోంది. అసలే మండుటెండలు. 40 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు. ఇలాంటి పరిస్థితుల్లో పింఛన్ దారులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. వేదనాభరితం.

– నకరికల్లు, సత్తెనపల్లి, ముప్పాళ్ల


ముప్పాళ్ళలోని సెంట్రల్ బ్యాంక్ మెట్లపై పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

నకరికల్లు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో పింఛన్ ఇంటికే వచ్చేది. ఎన్నికల కోడ్ రావడంతో చంద్రబాబు అనుచరులు తప్పుడు ఫిర్యాదుతో వలంటీర్ల సేవలదూరం చేశారు. పర్యావసానంతో రెండు నెలలుగా పింఛన్‌దారుల కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి. పింఛనే లేకపోతే నెల అవసరాలు గడవని బతుకులు బాధల్ని దిగమింగుకుంటూ ఎండల్లో ప్రయాసలు పడుతున్నారు. వేలి ముద్రలు సరిగ్గా పడక, ఏ ఖాతాలో జమ అయ్యాయో తెలుసుకునేందుకు బ్యాంకులు, ఆన్‌లైన్ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. బ్యాంకు ఖాతాకు ఆధార్‌లింక్ కాలేదని ఒకరు, ఈ కేవైసి కోసం మరొకరు, ఫోన్ నంబర్‌కు ఆధార్ లింక్ జతకాలేదంటూ ఇంకొకరు..ఇలా ఒక్కో లబ్దిదారునిది ఒక్కో వ్యథ. ఇదిలా ఉంటే కొన్నిచోట్ల పింఛన్ నగదు విత్‌డ్రా చేసినందుకు బ్యాంకులకు వెళ్తుంటే రూ50 నుంచి రూ100లు కట్ చేసుకుంటున్నారని పింఛన్‌దారులు ఆరోపిస్తున్నారు. గురువారం పలుచోట్ల పింఛనుదారులు పడిన అగచాట్లు వారి మాటల్లోనే...

ఏడు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చా



ఐదేళ్ల జీతగాళ్ల లెక్క వలంటీర్ ఇంటికొచ్చి మరీ పింఛన్ చేతిలో పెట్టారు. పింఛన్ ఎప్పుడు తీసుకున్నామో పక్కవాళ్లకు తెలిసేది కాదు. ఇప్పుడు ఇదేం ఖర్మో మాకు పొద్దున్నుంచి నడిఎండలో నానాబాధలు పడుతున్నాను. కాళ్లు లాగుతున్నాయి. గుండెలో దడ పుడుతుంది. మూడు వేల కోసం ఏడు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చా. ఈ బాధలు ఇంకెన్నాళ్లో.

– పోతులూరి పోలయ్య, శివాపురంతండా, నకరికల్లు మండలం

కళ్లు బైర్లు కమ్మి కూలబడ్డా



ఎండలో పింఛన్ కోసం నిలబడలేక కళ్లు బైర్లు కమ్మి కూలబడ్డా. ఇక్కడేమో చాలామంది ఉన్నారు. పింఛన్ ఇయ్యమంటే ఆగాగు అంటు న్నారు. ఎండకి ప్రాణం దడకొడుతుంది. ఇలాంటి బాధలు వస్తాయని అనుకోలేదు. పింఛన్ కోసం మా ప్రాణానికి తెచ్చినోళ్లకు ఉసురు తగులుతుంది.

– యం.కోటమ్మ, ఎస్టీకాలనీ, నకరికల్లు

ఆధార్ లింక్ కాలేదని వెనక్కు పంపారు



మాది ఉదయ్‌నగర్‌కాలనీ, నకరికల్లు నుంచి 9 కిలోమీటర్ల దూరంలో అడవిలో ఉంటాం. నెలనెలా వలంటీర్ మా ఊరొచ్చి ఇచ్చి వెళ్లేవాడు. ఇప్పుడేమో బ్యాంకుకు రావాల్సి వచ్చింది. ఎండలోనే కాళ్లీడ్చుకుంటూ వచ్చా.. మధ్యాహ్నం అయింది. ఇప్పుడేమో బ్యాంకులో వాళ్లు ఆధార్ లింక్ కాలేదు. పింఛన్ ఇవ్వమనడంతో తిరిగి ఇంటికి వెళ్తున్నా. ఆధార్‌లింక్ చేయించుకుంటే గాని పింఛన్ రాదంట. వచ్చే డబ్బులతో మందులు, మాకులు కొనుక్కొని వెళ్దామనుకుంటే పింఛనే దూరమైంది.

– యండటి పూలయ్య, ఉదయ్‌నగర్‌కాలనీ, నకరికల్లు మండలం


నకరికల్లులోని ఆన్‌లైన్ కేంద్రాల వద్ద మండుటెండలో పింఛన్ కోసం నిలుచొని ఉన్న వృద్ధులు


బ్యాంక్‌లోపల పింఛన్‌సొమ్ము కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు


సత్తెనపల్లి సీజీజీబీ వద్ద వేచి ఉన్న అవ్వాతాతలు


సత్తెనపల్లి ఎస్‌బీఐ ప్రధాన శాఖలో నగదు తీసుకునే ఫారం రాయించుకుంటున్న వృద్ధులు

క్లుప్తంగా

రామకృష్ణకు సన్మానం



సత్తెనపల్లి: ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణకు డాక్టరేట్ సందర్బంగా ఆర్యవైశ్య సేవా సమితి, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఆర్యవైశ్య సేవా సమితి అధ్యక్షుడు వెలుగురి శరత్, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, షేక్ మహమ్మద్ గని, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పెరుమాళ్ళ లక్ష్మీశివన్నారాయణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్, కాపుగంటి రత్తయ్య, శంకర్, ఆకుతోట దుర్గారావు, దేవతి సుబ్బారావు(మెమంటో), కొత్తూరి విశ్వేశ్వరరావు, కొత్త లక్ష్మయ్య, చిలకల.వాసు, రెడ్డి శ్రీను, దేవరపల్లి కాశీవిశ్వనాథం, చెక్కరవి, మాచర్ల సత్యనారా యణ, దేవరపల్లి తేజ, భవిరిశెట్టి హరి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ పుణ్యాల హఠాన్మరణం

రాజుపాలెం: కొండమోడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, రాజుపాలెం మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ పుణ్యాల రామిరెడ్డి(52) గుండెపోటుతో మృతి చెందారు. రామిరెడ్డి 2019–2021 వరకు రాజుపాలెం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా వ్యవహరించారు. ఈనెల 1 ఉదయం దేవరంపాడులో రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం ఇంటికి వెళ్లి నిద్రిస్తుండగా నిద్రలోనే గుండెపోటుతో మరణించారు. రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

సకలవర్గాల సంక్షేమం జగన్ తోనే సాధ్యం

మంత్రి అంబటి సతీమణి విజయలక్ష్మి



సత్తెనపల్లి: కుల, మత, పార్టీలు, రాజకీయాలకతీతంగా సమాజంలోని అన్ని వర్గాలకు మేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి అంబటి రాంబాబు సతీమణి విజయ లక్ష్మి అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో వార్డు ఇన్‌చార్జ్ నందిగామ ఆదాం తో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. ఐదేళ్లలో సచివాలయం పరిధిలో రూ. 32 కోట్ల సంక్షేమ, అభివృద్ధి జరిగిందన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న అంబటి రాంబాబు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌ను అఖండ మెజారీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హసంతి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ, , పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, సెగ్గెం వెంకటేశ్వరరావు, గంటా ఏసుబాబు, కౌన్సిలర్లు మహిళా నేతలు, పాల్గొన్నారు.

క్రేన్ ఢీ : వ్యక్తి మృతి

నకరికల్లు : గుండ్లపల్లి సమీపంలో ఓ క్రేన్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. . ఎస్‌ఐ పి.రాంబాబు తెలిపిన వివరాల మేరకు..నరసరావుపేట మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన ఎంపరాలు ఏడుకొండలు (43), అదే గ్రామానికి చెందిన గుంటక సాంబిరెడ్డితో కలిసి గుండ్లపల్లి వచ్చాడు. పని ముగించుకొని తిరిగి వెళ్తూ గ్రామ శివారున ద్విచక్రవాహనం నిలిపారు. ఈ క్రమంలో వెనుక నుంచి అతివేగంగా వస్తున్న క్రేన్ ఢీకొట్టడంతో బైక్‌పై ముందుకూర్చొని ఉన్న ఏడుకొండలు తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే అసువులు బాసాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గిరిజనుల కుటుంబాల్లో వెలుగులు నింపిన జగన్

వెల్దుర్తి: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గిరిజనుల బతుకుల్లో వెలుగులు నింపారని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతునాయక్ అన్నారు.గురువారం మండలంలోని చినపర్లపాయి తండా, పిచ్చయ్య బావి తండా, శివలింగాపురం, మండాది గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన 90శాతం మంది ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన వారేనన్నారు.

మైనారిటీలే మూలస్తంభాలు

–మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: వైఎస్సార్ సీపీకి మైనార్టీ వర్గాలే మూల స్తంబాలని జలవనరుల శాఖమంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గ అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని రెడ్డిగూడెం పులిచింతల నిర్వాసిత కేంద్రంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు అంబటిపై పూల వర్షం కురిపించారు. మహిళలు భారీ సంఖ్యలో హాజరై దిష్టి తీసి హారతులిచ్చారు. మసీదులు, చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రచార రథంపై ప్రధాన వీధులన్ని కలియదిరిగారు.కార్యక్రమంలో సర్పంచ్ జరీనాసాదుల్లా, ఎస్‌కె భాషా, జానీ, వెంకటేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, ఎస్‌కె సుభాని తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి రెండు గ్రామాల టీడీపీ కార్యకర్తలు



అచ్చంపేట : నిండుజర్ల, మిట్టపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీ గూటికి చేరారు. ఎమ్మెల్యే నంబూరు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిండు జర్లలో 10 కుటుంబాలకు చెందిన 30మంది కార్యకర్తలు, మిట్టపాలెంలో 20 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో ఉన్నారు. అలాగే కస్తల గ్రామ టీడీపీ నాయకుడు షేక్ రబ్బావలి పార్టీలోకి చేరారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

మాచర్ల రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఫైనల్ ఓటర్ల జాబితా, పోస్టల్, పిడబ్ల్యూడి ఓట్లు వేసేందుకు కేంద్రంలో ఎంపిక చేసి బ్యాలెట్ ముద్రణ, ఈవీఎంలు, సింబల్ తయారైపోయిందని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్ తెలిపారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కూటమి మేనిఫెస్టో ..ఓ బూటకం

- బాబు హామీలను ప్రజలు నమ్మరు
- మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్య
- రాజుపాలెం, బ్రాహ్మణ పల్లిలో జోరుగా ఎన్నికల ప్రచారం


రాజుపాలెం, బ్రాహ్మణపల్లి ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర మంత్రి అంబటి

రాజుపాలెం: ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ చేయగలిగినవే మేనిఫెస్టోలో చేర్చి ప్రజల విశ్వసనీయతను చూరగొన్న గొప్ప నాయకుడు సీఎం జగన్ మోహన్ రెడ్డి అని జలవనరులశాఖ మంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. కూటమి మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. మండలంలోని రాజుపాలెం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కుట్ర వల్లే ఈ రోజు లక్షలమంది వృద్ధులు పింఛన్ల కోసం బ్యాంకుల చుట్టూ ఎండలో తిరగలేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వారి అవస్థలకు చంద్రబాబే కారణమని విమర్శించారు. వలంటీర్ల వ్యవస్థపై చేసిన ఆరోపణలే దీనికి నిదర్శనమన్నారు. ఫ్యాన్‌గుర్తుకు ఓటేసి జగన్‌మోహన్ రెడ్డిని గెలిపిస్తే మొదటి సంతకం వలంటీర్ల వ్యవస్థపైనే పెడతారని గుర్తు చేశారు. జగనన్న ప్రభుత్వం వస్తే ఒకటో తేదీనే ఇంటి వద్దకే పింఛన్లు వస్తామని వృద్ధులకు భరోసా ఇచ్చారు. ప్రతీ ఒక్కరు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనతోపాటు ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ కు విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, రాజుపాలెం, బ్రాహ్మణపల్లి సర్పంచ్‌లు పులిబండ్ల అశోక్, ఓర్సు వెంకటపతి, ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, జీడీసీ ఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, లాయర్ సూరిబాబు, మాజీ ఎంపీపీ బాసులింగారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, కేదారి నాగేశ్వరరావు, చెవుల స్వామి, బత్తుల శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణాన్ని తలపించిన ప్రచార పర్వం

ఈ సందర్భంగా స్థానికుల నుంచి ఆయనకు అపూర్వ ఆదరణ లభించింది. మహిళలు భారీ సంఖ్యలో ఎదురేగి హారతులిచ్చారు. డీజేలు, తీన్మార్లతో ఆయా గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది. పిల్లలు, మహిళలు, వృద్ధులు, యువకులు అంబటి రాంబాబు ప్రచారంలో భారి సంఖ్యలో పాల్గొన్నారు. ప్రచార రథంపై ప్రధాన వీధుల్లో అభివాదం చేస్తూ అంబటి ముందుకు కదిలారు. ముఖ్యమైన నేతలు, క్రియాశీలక కార్యకర్తల ఇళ్లకు వెళ్లి రానున్న ఎన్నికలపై చర్చించారు.

మైనారిటీల పక్షపాతి ..సీఎం జగన్


పార్టీలో చేరిన నకరికల్లు ముస్లిం సోదరులతో మంత్రి అంబటి రాంబాబు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నకరికల్లు ముస్లిం సోదరులు

సత్తెనపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనారిటీల పక్షపాతి అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. నకరికల్లు పాతూరు టీడీపీకి చెందిన సయ్యద్ ఖాదర్ బాషా, సయ్యద్ రస్ హుస్సేన్‌లు గురువారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో అంబటి రాంబాబు సమక్షంలో చేరారు. ఈ మేరకు వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది మహానేత వైఎస్సార్ అని గుర్తు చేశారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో రెండు అడుగులు ముందుకు వేసి ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారన్నారు. 2019 ఎన్నికల్లో ఐదుగురికి ఎమ్మెల్యేలుగా అవకాశం కల్పిస్తే ... 2024 ఎన్నికల్లో ఏడుగురికి సీట్లు ఇచ్చారన్నారు. నలుగురికి శాసనమండలిలో జగన్ మోహన్ రెడ్డి స్థానం కల్పించారన్నారు. దేశ వ్యాప్తంగా ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ రద్దు చేస్తామని ప్రకటించిన బీజేపీ, దాంతో అంటకాగుతున్న టీడీపీ, జనసేన వైఖరిని ముస్లిం సోదరులు గమనించాలన్నారు. గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో ముస్లిం సోదరుల అభివృద్ధికి విశేషంగా కృషి చేశానన్నారు. అల్లా ఆశీస్సులతో తనను సత్తెనపల్లి ఎమ్మెల్యేగా, నరసరావుపేట ఎంపీగా డాక్టర్ పి అనిల్‌కుమార్‌యాదవ్‌ను అఖండ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ. వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్ బీబాషా, షేక్ బాజీ, షేక్ సుబానీ,షేక్ సైదా, గంటా శివ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విశ్వసనీయతే..జగనన్న వజ్రాయుధం : అంబటి


చౌటపాపాయపాలెం, కొత్తబోధనం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

రాజుపాలెం: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కి విశ్వసనీయతే వజ్రాయుధమని జలవనరుల శాఖమంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు. ఆ విశ్వసనీయతే ప్రజలపై ఆయనకు ఎనలేని నమ్మకాన్ని పెంచాయన్నారు. చౌటపాపాయపాలెం, కొత్తబోధనం గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించగా స్థానికుల నుంచి విశేష ఆదరణ లభించింది. మహిళలు బారులుతీరి దారిపొడవునా పూలవర్షం కురిపించారు. హారతులిస్తూ ఆప్యాయంగా ఆహ్వానించారు. పధాన వీధుల్లో అంబటి ప్రచార రథంపై కలియదిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త బోధనం, చౌటపాపాయపాలెం గ్రామాల సచివాలయాల పరిధిలో రూ13.95 కోట్ల సంక్షేమ ,అభివృద్ధి నిధులు వెచ్చించడం జరిగిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకుల మాట వింటే నట్టేట మునిగినట్టేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు,పూర్వ వలంటీర్లు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనకు టాటా

వైఎస్సార్ సీపీ గూటిలో చేరిన 40 కుటుంబాలు


ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డితో పార్టీలో చేరిన వెంకటాయపాలెం నాయకులు

బెల్లంకొండ: తెలుగుదేశం పార్టీ నుండీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఒక్కొక్కరుగా వరుస కడుతున్నారు. గురువారం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 30 కుటుంబాల కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. అదే విధంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాష్యం ప్రవీణ్ సమక్షంలో చేరిన ఎస్టీలు తిరిగి వైఎస్సార్‌సీపీ బాట పట్టారు. ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన తోట కోటేశ్వరరావు, పాదిలి శ్రీను, ఇసాకు నాయక్, రాముడు నాయక్, బాలు నాయక్, కోటేశ్వరరావు నాయక్, శ్రీకాంత్ నాయక్, రామారావు నాయక్, కొల్లి రవి, కొత్తపల్లి మాస్, లచ్చా నాయక్ కుటుంబాలు పార్టీలోకి చేరాయి.కార్యక్రమంలో ఎంపీటీసీ చిట్టింశెట్టి శివనాగమణి, సర్పంచ్ దేసు బ్రహ్మం, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, భుక్యా రామకోటినాయక్, కర్రి గోపి, నందనమూడి వెంకటేశ్వరరావు, భోజ్యా నాయక్, భోడ్కానాయక్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలి

ఎంపీడీఓ పెదప్రోలు శంకర్‌రావు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగి పని అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని ఎంపీడీఓ పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మండలంలోని మంచికల్లు గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన మేజర్ కాల్వ అభివృద్ధి పనులను, ఫారెస్ట్ భూమిలో తీస్తున్న నీటిగుంటలను ఆయన పరిశీలించి, మస్టర్‌ను తనిఖీ చేశారు.

కొమెరపూడిలో టీడీపీకి భారీ షాక్

- వైఎస్సార్ సీపీలో చేరిన 35 కుటుంబాలు
- సాదరంగా ఆహ్వానించిన మంత్రి అంబటి రాంబాబు


వైఎస్సార్ సీపీలో చేరిన కొమెరపూడి వాసులతో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: కొమెరపూడి గ్రామంలో టీడీపీకి ఊహించని షాక్ తగిలింది. ఆ పార్టీకి తొలినుంచి అండగా ఉంటున్న 35 కుటుంభాల ప్రతినిధులు బుధవారం వైఎస్సార్ సీపీ గూటికి చేరారు. రైతు సలహా మండలి రాష్ట్ర సభ్యుడు కళ్ళం విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి అంబటి రాంబాబు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో పేద వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీలో చేరడం విజయానికి బాటలు వేయడమేనన్నారు. పార్టీ విజయానికి కృషి చేసిన వారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. కొమెరపూడికి చెందిన జంగాల.రమణయ్య,సాల్మన్, కొరప్రాటి ప్రభు, బందెల నాగరాజు తదితరుల ఆధ్వర్యంలో 35 కుటుంబాలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, మండల నాయకుడు సంకటి శ్యాంసన్, గ్రామ సర్పంచ్ కొరివి అనిల్‌కుమార్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

అవ్వా-తాతల శాపనార్థాలు

నరసరావుపేట రూరల్: వృద్ధులకు పెన్షన్ కష్టాలు ఈ నెల కూడా తప్పలేదు. వలంటీర్ ద్వారా పింఛన్ పంపిణీ చేపట్టవద్దని టీడీపీ రాష్ట్ర ఎన్నికల కమిషన్ వద్ద ఫిర్యాదు చేశారు. దీంతో గత నెల నుంచి పింఛన్ పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను తొలగించారు. గత నెలలో గ్రామసచివాలయాల వద్దనే లబ్ధిదారులకు పింఛన్ పంపిణీని సచివాలయ సిబ్బంది నిర్వహించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. ఈనెలలో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో పింఛన్ నగదు జమ చేస్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది.

ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 9 గంటల నుంచే బ్యాంక్‌ల వద్ద లబ్ధిదారులు పడికాపులు కాయాల్సి వచ్చింది. స్వగ్రామాల్లో బ్యాంక్‌లు లేకపోవడంతో సమీప గ్రామాల్లోని బ్యాంక్‌ల వద్దకు వెళ్లాల్సి వచ్చింది. పెద్ద ఎత్తున పింఛన్‌దారుల రావడంతో ములకలూరు బ్యాంక్ కిటకిటలాడింది. భానుడి భగభగతో పాటు ఉక్కపోత కారణంగా లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంత మందికి పింఛన్ నగదు జమకాగా, సాంకేతిక సమస్యల కారణంగా కొందరికి జమ కాలేదు. రెండు గంటలకుపైగా బ్యాంక్‌లో వేచి ఉన్న తరువాత నగదు జమకాలేదని చెప్పడంతో వృద్ధులు నిరాశతో వెనుతిరిగారు.